


# శ్రీ గంగా అన్నపూర్ణ సమేత

# శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి వారి శతజయంతి వార్షిక బ్రహ్మోత్సవం

# మరియు

# మహాకుంభాభిషేక మహోత్సవ విశేషాలు

# కార్యక్రమ పూర్వాపరాలు




1917వ సంవత్సరంలో జరిగిన మొదటి కళ్యాణం నుండి 2015లో జరిగిన తొంభై తొమ్మిదవ కళ్యాణం వరకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా మూడు రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం కళ్యాణ మహోత్సవం జరపటం అనవాయితీగా వస్తోంది....ఇప్పటి వరకు అ స్వామి వారి మహిమతోనే గ్రామ ప్రజలు అష్టఐశ్వరాలు, అయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో అలరారుతున్నట్లు గ్రామస్తుల పూర్తి నమ్మకం.

2016 సంవత్సరం నాటికి ఆలయానికి వందేళ్లు పూర్తి అవుతాయని, అసందర్భంగా నూరు వసంతాల వేడుకలు ఘనంగా జరుపుకుంటే మన పొనుగుపాడు గ్రామం, గ్రామంతోపాటు గ్రామస్తులు మరింత అభివృద్ధి చెందుతారనే విషయాన్ని గత ఐదేళ్లుగా స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలందరికి చిర పరిచితుడైన కె.వి.కె. రామారావు పదే పదే చెపుతూ వచ్చారు. ఆయన ఇంకా తన అనుభవాలను వివరిస్తూ, 1997 వరకు గ్రామ స్థాయిలో ఉండే నరసరావుపేట ద్విశతాబ్ధి ఉత్సవాలను జరుపుకోవలసిన విషయాన్నికూడా అక్కడి పెద్దలతో అనేక పర్యాయములు చెప్పటం జరిగిందని, అప్పటి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి డాక్టరు కోడెల శివప్రసాదరావు పూనుకుని ఆ కార్యక్రమాన్ని జన్మభూమితో మిళితం చేసి అనుకున్నది సాధించి 200 ఏళ్ల పండగను జరుపుకుని ఓ నగరం స్థాయికపెంచిన వైనాన్ని అలయ ధర్మకర్తలకు, గ్రామస్తులకు పలుమార్లు వివరిస్తూ వచ్చారు. ఆ స్వామి అనుగ్రహంతో అందరూ ఆలకించి ఆలోచనలో పడ్డారు.

దాని పర్యవసానంగా స్వామి వారి 98 కళ్యాణం సందర్భంగా వందేళ్ల పండగ గురించి ఆలయ ఆవరణలో 15.03.2014న ఉదయం గం.11.00 లకు మొదటిసారిగా శీ వంకాయలపాటి శివరామకృష్ణయ్య అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు పెద్దలు, పిన్నలు ప్రసంగించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అప్పటి నుండి అనేక పర్యాయములు డాక్టరు మర్రి పెద్దయ్య, వంకాయలపాటి శివరామకృష్ణయ్య, వంకాయలపాటి బలరామకృష్ణయ్యల ఆధ్వర్యంలో, వంకాయలపాటి సూర్యనారాయణ పర్యవేక్షణలో పలుమార్లు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి దూర ప్రాంతాలనుంచి కూడా పలువురిని పిలిచి సంప్రదింపులు జరిపి మంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.

ఆ సమావేశాలకు కె.వి.కె. రామారావుతో పాటు, పలుదేశాలలో ఉన్నత పదవులలో పనిచేసి 2010లో ఆగ్నేయ యూరప్ దేశాలలోని సి.ఇ.ఒ. లందరిలోను అత్యుత్తమ సి.ఇ.ఒ. అవార్డు పొందిన గుంటుపల్లి జగన్నాధం, డాక్టరు పాతూరి సీతారామాంజనేయులు, హైదరాబాదు నుండి యర్రా నాగేశ్వరరావు, డాక్టరు వడ్డవల్లి

పుష్పలత, డాక్టరు వడ్డవల్లి విజయ, గుంటూరు వికాస్ కళాశాల అధినేత పొనకల శంకరరావు, బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్స్ ఎక్జిక్యూటివ్ డైరక్టరు వంకాయలపాటి సురేష్ బాబు, తదితరులు పాల్గొని ఆయా విషయాలు చర్చించటం కాకుండా ఖర్చులు నిమిత్తం పలువురు లక్షలాది రుపాయలు విరాళం అందజేయటం చెప్పకోదగిన విశేషం.

ఈ కార్యక్రమాలు సజావుగా జరగటానికి జంపని వారసులలో ముఖ్యురాలైన రామలక్ష్మమ్మ ప్రతినిధిగా మఱ్ఱి గోపాలకృష్ణయ్య అధ్యక్షుడుగాను, కోటిలింగయ్య కోశాధికారిగాను, రాయంకుల తాతయ్య, జగన్మోహనరావు, వంకాయలపాటి సూర్యనారాయణ, సుధాకరరావు, వీరాంజనేయులు, డాక్టరు లక్ష్మి మాధవరమణలు పాలకవర్గ సభ్యులుగా " జంపని రామలక్ష్మమ్మ మెమోరియల్ సొసైటీ" ని (రిజిష్టరు నెం.రు. 13/2015) స్థాపించటం జరిగింది.

ఎట్టకేలకు ఆలయపాలకవర్గం, జంపని రామలక్ష్మమ్మ మెమోరియల్ సొసైటీ పాలకవర్గం సంయుక్తంగా పలువురు ప్రసిద్ధ పీఠాధిపతులు, పండితులు, పెద్దలు ప్రముఖులుతో చర్చించి ఆలయ శతజయంతితోపాటు, మహాకుంభాభిషేకం కూడా 19.03.2016 నుండి 26.03.2016 వరకు ఎనిమిది రోజులు శాస్త్రవిహితంగా, అత్యంత వైభవంగా వందేళ్ల పండగ జరపటానికి నిర్ణయించి కార్యక్రమానికి ఒక రూపం తెచ్చి సన్నాహాలు ప్రారంభించారు.

మఱ్ఱి గోపాలకృష్ణయ్య, రాయంకుల తాతయ్య, వంకాయలపాటి శివరామకృష్ణయ్య, డాక్టరు మఱ్ఱి పెద్దయ్య, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, వంకాయలపాటి సూర్యనారాయణ, రాయంకుల







శ్యామ సుందరరావు, వంకాయలపాటి లక్ష్మి మాధవరావు (సర్పంచ్), కోటిలింగయ్య, సురేష్ బాబు, వట్టాభి రామారావు తదితరులు ముందుండి నడిపించటానికి పూనుకున్నారు. కుల మతాల ప్రసక్తి పక్కన పెట్టి, చిన్న పెద్ద తేడా లేకుండా వారితోపాటు గ్రామ ప్రజలు వందేళ్ల పండుగ ఘనంగా జరగటానికి చేయి చేయి కలిపారు

ఇక కార్యచరణ ప్రారంభించి ఆలయపాలకవర్గం తరపున డా॥ మఱ్ఱి పెద్దయ్య, రాయంకుల తాతయ్య, వంకాయలపాటి శివరామకృష్ణయ్య, బలరామకృష్ణయ్య, సూర్యనారాయణ తదితరుల ఆధ్వర్యంలలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ సారధ్యంలో డాక్టరు కోగంటి రంగనాయకి (తిరుప్పావైయై అమృతవర్షిణి), ప్రిన్సిపాల్, శ్రీ శారదానికేతనం, గుంటూరు మరియు శ్రీమతి మంచికంటి వెంకట సత్యవతి (ఉపన్యాస భారతి), రిటైర్డ్ టీచర్ గుంటూరు వారి ఆధ్యాత్మిక ప్రసంగాల ద్వారా ముందుగా ఈ ఉత్సవాలపై భక్తులకు, గ్రామ ప్రజలకు పలుమార్లు అవగాహన కల్పించి తగిన చైతన్యం తీసుకువచ్చారు.

గ్రామానికి దూరంగా దేశ విదేశాలలో ఉన్న పొనుగుపాడు నివాసులందరి మెయిల్ ఐడిలు యర్రా రామారావు సేకరించి రామలక్ష్మమ్మ సొసైటీ ద్వారా స్వామి వారి శత జయంతి ఉత్సవాల ఆహ్వానపత్రికలు పంపారు. www.Manaponugupadu.com, తదితర సోషల్ మీడియా ద్వారా కార్యక్రమ వివరాలు తెలుపుతూ "మన పొనుగుపాడుకు తరలిరండి" అనే నినాదంతో పొనుగుపాడు నివాసులను, వారి బంధువులును, స్నేహితులును పేరుపేరునా ఆహ్వానించారు. ఆహ్వానాలను అందుకున్న బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, ఇతర గ్రామాలనుంచి తరలి వచ్చిన భక్తులతో పొనుగుపాడు నిండిపోయింది. దాంతో గ్రామం అంతటా పండగ వాతావరణం నెలకొంది.

# శత జయంతి ఉత్సవాలు ప్రారంభం

స్వస్తి శ్రీ చాంద్రమానేన మన్మధ నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ ఏకాదశి శనివారం 19.03.3016 నాడు పొనుగుపాడు గ్రామంతో పాటు, లోక సంరక్షణార్థం శ్రీ గంగా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి శతజయంతి కార్యక్రమాలు కారంచేటి దక్షిణామూర్తి గురుకులు బ్రహ్మ ఆధ్వర్యంలో లంకా హనుమంతశర్మ, స్వర్ణ నరసింహమూర్తి, వేమరాజు ఫణిశర్మ, పులిగడ్డ బాలకృష్ణ, సామిరాజు రవికిమార్, తదితర 25 మందితో కూడిన వేద పండిత మండలి మరియు అలయ అర్చకులు కాకుమాను కళాధరశర్మ, కాకుమాను ఆంజనేయులు పర్వేక్షణలో ఇతర పూజారులు సప్తాహ్నిక దీక్షతో శాస్త్రబద్ధంగా, సాంప్రదాయంగా ప్రారంభించి, మహాద్భుతంగా, అత్యంతవైభవంగా ఆనాటి నుండి ఎనిమిది రోజులపాటు నిత్యపూజలు, హోమాలు నిర్విరామంగా నిర్వహించారు.







మొదటి రోజు శనివారం ఉదయం జంపని వారసులలో రాయంకుల వారి కుటుంబానికి చెందిన శ్యామ సుందరరావు, ఆదిలక్ష్మి దంపతులు ఈ ఎనిమిది రోజులు జరిగే మహా క్రతువు పూజా కార్యక్రమాలుకు అభ్యంగన స్నానం ఆచరించి పట్టుబట్టలుతో యాగకర్తలుగా యాగశాల ప్రవేశము చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన పూజలు చేసి రక్షాబంధనంతో దీక్ష స్వీకరణ చేసారు. ఆ తరువాత శుభసూచకంగా మేళతాళాలుతో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం అంతటా మామిడి ఆకులతో మంగళతోరణములు ఆలయం ప్రాంగణంలో కట్టి అలంకరించటంతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

















## ధ్వజపటారోహణ కార్యక్రమం



శివుడు సర్వాంతర్యామి. అష్ట దిక్కులను అంబరాలు (వస్త్రాలు) గా ధరించినవాడు. ధర్మపత్ని పార్వతీదేవి జగమంతటికీ అకలి తీర్చే మాతా అన్నపూర్ణ స్వరూపిణి. అందుకే ముందుగా ''ధ్వజపటారోహణ'' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పంటలు బాగా పండి, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ సర్వేశ్వరుని ప్రార్ధిస్తూ, ఇంద్రాది అష్టదిక్పాలకుల సహిత వృషభ, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల సాక్షిగా సర్వదేవతలను స్వామివారి కళ్యాణానికి అహ్వానిస్తూ తెల్లని వస్త్రంపై వృషభాకారం గీసి ధ్వజస్తంబానికి కట్టటంతో కార్యక్రమాలకు అంకురార్పణ జరిగింది.



ధ్వజపటారోహణ సందర్భంగా ధ్వజస్తంబానికి, నందీశ్వరస్వామి వారికి అన్న ప్రసాదాన్ని సమర్పిస్తారు. పూజారులు సమర్పించే ధ్వజప్రసాదం లేదా కొడిముద్ద తిన్న వారికి ఆయురారోగ్యాలు పెంపొందుతాయని, సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

### నిత్యపూజలు

గోపూజ, గణపతి పూజ, బిందె తీర్ధం, నగర సంకీర్తన, రుద్రాభిషేకం, చండీ సప్త పారాయణం, లలిత, విష్ణు సహస్ర నామపారాయణం, ఆదిత్య సామూహిక పారాయణాలు, 108 సార్లు హనుమాన్ చాలీసా, హరినామ సంకీర్తన, బలిహరణ కార్యక్రమాలు ఆ రోజు నుండి ఎనిమిది రోజులపాటు క్రమం తప్పకుండా ప్రతి రోజు జరిగాయి.






అలాగే ప్రతిరోజు స్వామి వారికి నిత్యార్చన, అమ్మ వారికి విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. శనివారం మొదటి రోజు మహాలక్ష్మీ అవతారం, సోమవారం రాజరాజేశ్వరీ అలంకారం, మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకారం, బుధవారం గౌరీదేవి అలంకారాలు జరిగినాయి. ప్రతిరోజు పారాయణ కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్ధప్రసాదాలు, అన్నప్రసాద వితరణ కావించారు.








## పారాయణం

నిత్యపూజలు అనంతరం ఆదివారం నాడు గుంటూరు వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం భక్తబృందం వారిచే జయశ్రీ, రమాదేవి సారధ్యంలో పారాయణ కార్యక్రమం నిర్వహించగా, సోమవారం నరసరావుపేట ప్రసన్నాంజనేయ దేవస్థానం భక్తబృందం వారిచే మాజేటి కామేశ్వరి, యు.భారతిల నేత్రత్వంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కంచర్ల రామారావు బృందం శివ పారాయణం నిర్వహించింది. మంగళవారం నాడు తిమ్మరాజుపాలెం శ్రీసీతారామాంజనేయ భక్త సమాజం వారిచే దొప్పలపూడి రమాదేవి, భానుమతి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది.



బుధవారం నాడు పెదపరిమి శ్రీ వేణుగోపాలస్వామి సంకీర్తన సమాజం వారు విష్ణు సహస్రనామ పారాయణం చేసారు. గురువారం నాడు శ్రీ గౌరి శంకర భజన సమాజం వారు భజన కార్యక్రమం, శనివారం హనుమాన్ చాలీసా, శ్రీ లలితా, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు.






## భజనలు

ఇక మధ్యాహ్న కార్యక్రమాలలో భాగంగా ఆ ఎనిమిది రోజులు చిరుమామిళ్ల శ్రీ ఆంజనేయ భక్త సమాజం తాళ భజన, ఎన్.సింహాచల శాస్త్రి భక్తరామదాసు హరికథ, మేరిగపూడి వారి తాళ భజన, ధూళిపాళ శివరామకృష్ణ భాగవతార్ గారిచే హరికథ, తొండపి భూపతిరావు పాట కచేరి, పెదజాగర్లమూడి పద్మజాచౌదరి బృందం కోలాటం, కంద్రిక వారి తాళ భజన, తి.తి.దే. సౌజన్యంతో అన్నమాచార్య భక్తిగీతాలు, సాతులూరి వారి తాళ భజన, బొప్పూడి వారి హరినామ సంకీర్తన, పొనుగుపాడు శ్రీవిరాట్ సాయిగాయత్రి సేవా సమాజం వారి తాళ భజన కార్యక్రమాలు శ్రవణానందంగా జరిగాయి. గ్రామ పంచాయితీ వద్ద కావూరి మహిళల కోలాటం రామాలయం వద్ద జరిగిన నరసరావుపేట బృందం పాట కచేరిలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ప్రవచనాలు







ఆ ఎనిమిది రోజులు సాయంత్రం కార్యక్రమాలు మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి. అధికంగా హాజరైన భక్తులను ఆధ్యాత్మిక ప్రవచనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థానకవి ప్రొఫెసర్ మేడసాని మోహన్, నంది అవార్డు గ్రహీత డాక్టరు మీగడ రామలింగ స్వామి, నారాయణం ప్రసాదాచార్యులు, శ్రీమతి బెల్లంకొండ శివకుమారి, శ్రీనివాస అయ్యంగార్, శ్రీమతి మంచికంటి వెంకట సత్యవతి (ఉపన్యాస భారతి), డాక్టరు కోగంటి రంగనాయకి (తిరుప్పావై అమృత వర్షిణి), తదితరులు జనరంజకంగా ప్రసంగించారు.








డా॥ మీగడ రామలింగస్వామితో ఆలయపాలకవర్గము, తదితరులు

## సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రతి రాత్రి ఆ ఎనిమిది రోజులు దేవాలయం ఆవరణలోని వేదిక ప్రాంగణంతో పాటు, నూతనంగా శ్రీవిశ్వేశ్వరస్వామి ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రేక్షకులతో నిండినది. సాంస్కృతిక కార్యక్రమాలు అన్నీ ప్రజలకు కనువిందు చేసాయి. విజయవాడ డాక్టరు అజయ్ కుమార్ నిర్వహించిన 'శివలీల' కూచిపూడి నృత్యం, భరతనాట్యం, శ్రీ సవేరా ఆర్ట్ కడప వారి 'పాదుకా పట్టాభిషేకం', 'భక్తమార్కండేయ' పౌరాణిక పద్యనాటకాలు, గుంటూరు సాయి మంజీర వారి కూచిపూడి నృత్యం, చెరుకుపల్లి ఉషోదయవారి 'భూకైలాష్' పౌరాణిక పద్యనాటకం, జోశ్యుల కూచిపూడి నృత్యం, దక్షయజ్ఞం పౌరాణిక పద్యనాటకం, కిలారు అనూరాధ భక్తి గీతాలాపన, పొనుగుపాడు గ్రామానికి చెందిన చిన్నారులు పాతూరి శ్వేచ్ఛ, స్ఫూర్తి, వంకాయలపాటి నిత్య, ముప్పిరి ధీరజ్, శ్రీనిత్య, మర్రి నితేష్ సాయికృష్ణ, హవిష్యల నృత్య ప్రదర్శనలు అద్భుతం అనిపించాయి.

ఓపెన్ ఎయిర్ థియేటర్ నందు జరిగిన పద్యనాటకాలు గద్దె (అభినయ) శ్రీనివాస్ పర్యవేక్షించగా, అలయప్రాంగణంలో జరిగిన అన్ని కార్యక్రమాలను కె.వి.కె. రామారావు పర్యవేక్షణలో నిర్వహించబడ్డాయి.





ఈ వందేళ్ల పండగ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలకు మృదంగ విద్వాన్ మోదుకూరి నాగధరరావు, ప్రముఖ వాయిలిన్ విద్వాన్ పాలేటి గోవర్ధనరావులు మృదంగ, వాయిలిన్ వాయిద్యకారులుగా కార్యక్రమాలను వారి ప్రతిభతో రక్తి కట్టించారు. గత 20 సంవత్సరముల నుండి స్వామి వారికి ప్రతి సంవత్సరము జరిగే వార్షిక కళ్యాణములకు వీరిద్దరూ పనిచేయుట విశేషం.


శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి శత జయంతి


2016 మార్చి 19 నుండి 26 వరకు




శ్రీ గంగా అన్నపూర్ణ సమేత
శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి శత జయంతి


ఆధ్యాత్మిక సాంస్కృతికోత్సవమ్








మహా కుంభాభిషేక మహోత్సవమ్ - నూరు వసంతాల వేడుకలు
2016 మార్చి 19 నుండి 26 వరకు
గుంటూరు జిల్లా.


శ్రీ గంగా అన్నపూర్ణ సమేత
శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి శత జయంతి
మహా కుంభాభిషేక మహోత్సవమ్ - నూరు వసంతాల వేడుకలు










శ్రీ గంగా అన్నపూర్ణ సమేత



## మన పొనుగుపాడు జంపని వారసుల చరిత్ర పుస్తకావిష్కరణ

అంధ్రప్రదేశ్ శాసనసభాపతి డాక్టరు కోడెల శివప్రసాదరావుకు పొనుగుపాడు గ్రామ పొలిమేరలో ఘనంగా స్వాగతం పలికి మేళతాళాలు, బాణాసంచా కాలుస్తూ ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చారు. వేద పండితులు ఆయనకు స్వాగతం పలికి దైవదర్శనం చేయించారు. అనంతరం వేదికమీద జరిగిన సభలో యర్రా రామారావు రచించిన జంపని వారి చరిత్ర వారి వంశవృక్ష గ్రంథాన్ని 20.03.2016న కోడెల ఆవిష్కరించి, రామారావును కొనియాడారు. గత ఏడాది కళ్యాణోత్సవం సందర్భంగా పొనుగుపాడు దేవాలయం వందేళ్ల పండగ చేసుకోవలసిన విషయాన్ని చెప్పానని, నరసరావుపేట ద్విశ్వతాబ్ది ఉత్సవాలను పురష్కరించుకుని తాను ఎంతగా పట్టణాన్ని అభివృద్ధి చేసిన వివరాలను కూడా తెలియజేశానని కోడెల గుర్తు చేసారు.

ఇంకా కోడెల మాట్లాడుతూ దేవుడు లేకుంటే ప్రజల జీవితాలు బ్రేకులు లేని కారులాంటి జీవితాలుగా ఉంటాయని, కీర్తికోసం కాకుండా లోకకళ్యాణం కోసం చేసే ఈ శత వసంతాల వేడుకల్లో పాల్గొనటం అనందగా ఉందని, దేవుడే లేడనుకుంటే మనిషి ఇష్టం వచ్చినట్లు అరాచకాలు చేస్తాడని, అందుకే క్రమమైన జీవితం ఉండాలంటే దేవునిపై నమ్మకం, తగిన భయం ఉండాలని ఆయన తెలిపారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గ్రంథకర్త యర్రా రామారావుతోపాటు, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, సర్పంచ్ వంకాయలపాటి మాధవరావు, కె.వి.కె. రామారావు తదితరులు పాల్గొన్నారు. తదుపరి సభాపతి డాక్టరు కోడెలను ఆలయ పాలకవర్గం తరుపున సర్పంచ్ మాధవరావు దుశ్శాలువతో సత్కరించారు

















## కళ్యాణోత్సవం

23.03.2016 పూర్ణిమ రోజు ఉదయం స్వామివారి కళ్యాణ మండపంలో ప్రారంభం అయిన శ్రీ గంగా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కళ్యాణంలో స్వామివారిని వంకాయలపాటి వారి కుటుంబానికి చెందిన వరుడుగా పరిగణిస్తే, అన్నపూర్ణదేవి అమ్మవారిని రాయంకుల వారి కుటుంబానికి చెందిన వధువుగా పరిగణిస్తారు. వరుడు స్వామి వారి (వంకాయలపాటి, మర్రి)వారి తరుపున శ్రీమాన్ కారంచేటి దక్షిణామూర్తి, వధువు అన్నపూర్ణదేవి అమ్మవారి (రాయంకుల)వారి తరుపున ప్రసాదపు నారాయణాచార్యులు వ్యాఖ్యాతలుగా భక్తులను అలరించారు? కళ్యాణమహోత్సవంలో భాగంగా ముందు జరిగిన రాయబారఘట్టంలో స్వామివారి గొప్పలు, అమ్మవారి గొప్పలు ఎవరికి వారు చెప్పుతూ, తిరిగి ఒకరినొకరు ఎదుటి వారి దోషాలు ఎంచుతూ వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన కారంచేటి దక్షిణామూర్తి, ప్రసాదపు నారాయణాచార్యులు జరిపిన రాయబారం కార్యక్రమం భక్తులను అలరించింది.









వంకాయలపాటి వారి కుటుంబాల తరుపున వెంకట్రావు, మాధవరావు, సుధాకరరావు, వెంకటరత్నబాబు, కోటిలింగయ్య, సురేష్ బాబు, పట్టాభిరామారావు, రాయంకుల వారి కుటుంబాల తరుపున జగన్మోహనరావు, శేషతల్పశాయి, విఠల్ రామ్, మద్రి కుటుంబాల తరుపున రామలింగయ్య, డాక్టరు ట్రూమన్ శ్రీనివాస్, తదితర ధర్మకర్తలు సతీసమేతంగా పీటలమీద కూర్చొని కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి కాకుమాను ఆంజనేయులు, కారంచేటి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో కళ్యాణం సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా శోభాయమానంగా జరిగింది. అనంతరం శ్రీ స్వామి వారి గ్రామోత్సవం భారీగా సాగింది, మేళతాళాలు, బాణాసంచాతో ఊరేగింపు గ్రామాన్ని చుట్టి వచ్చింది. ఊరేగింపు తరువాత నూతన వధూవరులకు (స్వామి వారికి, అన్నపూర్ణదేవి అమ్మ వారికి) దృష్టి దోషం నివారణార్థం ఉండేందుకు అదే రోజు సాయంత్రం రథోత్సవం (రథాంగ హోమం) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా











పాల్గొన్నారు. మరునాడు పాడ్యమి రోజున కూడా శ్రీ స్వామివారి గ్రామోత్సవం యధావిధిగా జరిగింది. అనంతరం వసంతోత్సవం, త్రిశూల స్నానం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు.











కళ్యాణ వ్యాఖ్యాతలు శ్రీమాన్ కారంచేటి దక్షిణామూర్తి, ప్రసాదపు నారాయణాచార్యులు

## వయోవృద్ధులకు సన్మానం

వృద్ధులైన తల్లిదండ్రులను దైవసమానంగా ఆదరిస్తూ వారి జీవితానికి సార్థకత చేకూర్చాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి కుటుంబ సభ్యునిపై ఉంది.

గతంలో ఎన్నడూ జరగని విధంగా వయోవృద్ధుల సన్మాన కార్యక్రమాన్ని ఈ వందేళ్ల పండగ సందర్భంగా నిర్వహించటాన్ని పలువురు ప్రశంసించారు. ఈ వేడుక కులమతాలకు అతీతంగా జరగటం మరో విశేషం. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులను గుర్తించి వారందరిని సాదరంగా ఆహ్వానించి ఆలయ ప్రాంగణంలో అందరి సమక్షంలో నూతన వస్త్రాలను బహుకరించారు. గ్రామస్తులు, ఇతర పెద్దలు, వయోవృద్ధులపై పూలజల్లు కురిపించి ఘనంగా సన్మానించి వారి అశీస్సులు పొందారు. ఈ కార్యక్రమం పొనుగుపాడు గ్రామంలో నిర్వహించడం హర్షించతగ్గ విషయంగా కొనసాగింది.











## కుంభాభిషేక కలశాల గ్రామోత్సవం

కలశం లేదా కలశి అనగా సన్నని మూతి కలిగి నీటితో నింపబడిన చిన్న పాత్ర.. కలశాన్ని త్రిమూర్త్యాత్మకంగా భావించి పూజించడం కోసం కలశానికి చుట్టూ పసుపు రాసి, మూడు చోట్ల కుంకుమ బొట్లు పెడతారు. కలశ జలంలో గంధం, అక్షతలు, పుష్పాలుతో తగినట్లుగా నింపుతారు. పూజ చేసిన కలశాలలో శాస్త్ర ప్రకారం కలశముఖంలో విష్ణుమూర్తి, కంఠభాగంలో శివుడు, మూలభాగంలో బ్రహ్మదేవుడు, మధ్యభాగంలో మాతృగణాలు ఆశ్రయిస్తారని కలశంలోని జలాల్లో సాగరాలన్నీ, సప్తద్వీపాలతో కూడిన భూమి, ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదాలు, వేదాంగాలతో సహా సమస్త దేవతా గణాలు ఆశ్రయిస్తారని నమ్మకం.

విదియనాడు (25.03.2016) గంగానది మరి ఇతర పుణ్య నదులలో సేకరించిన జలంను నింపి శాస్త్రోక్తంగా పూజించిన 108 మహాకుంభాభిషేక కలశాలను సాంప్రదాయ దుస్తుల ధరించి శిరస్సు మీద పెట్టుకుని వేద పండితులు, పూజారులు, అలయ ధర్మకర్తలు, భక్తులు గ్రామోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. వేద పండితులు, పూజారుల మంత్రోచ్ఛరణలతో, గ్రామ పెద్దలు, మహిళలు తోడు రావటంతో పొనుగుపాడు ఓ నూతన శోభను సంతరించుకుంది. ఇక మేళతాళాలు, బాణాసంచా హడావిడి ఉండనే ఉంది.







**సువాసిని పూజ**

అదే రోజు సాయంత్రం సువాసిని పూజ జరిగింది. సువాసి.. నులు అంటే ముత్తైదువలు అని అర్థం. ముత్తైదువలు "ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రే నమః" అనే మంత్రాన్ని 108 సార్లు జపిస్తూ అమ్మవారికి ( శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అవతారం) మాంగల్యబలం కోరుతూ పూజ చేస్తే అ తల్లి మాంగల్య సౌబాగ్యాన్ని ప్రసాదిస్తుంది అని పురాణాల ప్రకారం హిందూ వివాహిత స్త్రీల నమ్మకం. విదియ రోజు సాయంత్రం 250 మంది మహిళలు అలాంటి ప్రాముఖ్యత కలిగిన 'సువాసిని పూజ' లో పాల్గొన్నారు. పూజలో పాల్గొనిన మహిళల పాదాలను పసుపుతో అలంకరించి, బొట్టుపెట్టి వస్త్రం, గాజులు, పసుపు, కుంకుమ మొదలగు తొమ్మిది వస్తువులుతో శాస్త్రం, ప్రకారం ఇవ్వవలసిన దక్షిణ తాంబూలం అందజేసారు. ఈ కార్యక్రమాన్ని భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పాలకవర్గం ఘనంగా నిర్వహించారు. ఇతర గ్రామాలనుండి వచ్చిన భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.



కారంచేడు అశ్రమ పీఠాధిపతి శ్రీ ప్రణవానందగిరిస్వామి అయా కార్యక్రమలలో పాల్గొని, వేదిక మీద అధ్యాత్మిక భాషణం చేసి భక్తలకు దీవెనలు అందజేసారు.



## శ్రీ మణిదీప వైభవం (సాహిత్య రూపకం)

ఈ కార్యక్రమము నిర్వహణకు డాక్టరు కోగంటి రంగనాయకి (తిరుప్పావై అమృత వర్షిణి), మంచికంటి వెంకట సత్యవతి (ఉపన్యాస భారతి)లు సారధ్యం వహించారు. మణిదీపం బ్రహ్మలోకానికి పైన అత్యంత వైభవంగా కైలాసం, వైకుంఠం, గోలోకం కంటే శ్రేష్ఠంగా ఉంటుంది. దీనిని సర్వలోకమని కూడా అంటారు. నాలుగు వైపుల అమృత సముద్రము విస్తరించి ఉంటుంది. జగన్మాత పార్వతీదేవి మణిదీపంలో శ్రీత్రిభువనేశ్వరీదేవి (శ్రీ మహాలక్ష్మీ దేవి) రూపముగా అష్ట మాతృకగా నిలయమై ఉంటుంది. అలాంటి మణిదీప వైభవం గురించి వర్ణించిన సాహిత్యరూపకం భక్తులను అలరారించింది. అచ్యుతని రాధామాధవి శ్రీత్రిభువనేశ్వరిదేవి పాత్రలో భక్తులను ఆకట్టుకున్నారు. అమ్మ వారి సప్తమ రూపాలైన బ్రహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారహి, ఇంద్రాణి, చాముండి పాత్రలలో డా॥ వైష్ణవి దుర్గ, లక్ష్మీకుమారి, శివకుమారి తదితరులు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మణిద్వీప వైభవంలో భాగంగా కుమారి చిన్మయి భరత నాట్యం ప్రేక్షకులను రంజింపచేసింది. ఆలయపాలకవర్గం తరుపున వంకాయలపాటి బలరామకృష్ణయ్య, డా॥ మద్రి పెద్దయ్య వారిని సత్కరించారు.














## శతచండీయాగం

ఆలయ పాలకవర్గం వారు వందేళ్ల పండగ సందర్భంగా ఈ ఎనిమిది రోజులు హోమములు “శతచండీయాగం’ భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ కన్వీనరు, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల పర్యేక్షణలో వేద పండితులు సాగి ఆంజనేయులు, గూడా ఆంజనేయ శర్మ, తదితరులు నిర్వహించారు. చండి ప్రచండ శక్తి. చండీ ఆరాధనలు జరిగిన చోట అమ్మ వారి అనుగ్రహంతో ఆ ప్రాంతంలో అకాల మరణాలు సంభవించవని, దుర్భిక్షం ఉండదని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని, ధర్మబద్ధమైన అన్ని కార్యక్రమాలు అందరికి నెరవేరతాయని పురాణాలు వేదాలు ద్వారా మనకు తెలుస్తుంది. అలాంటి చండీయాగం జరిపించిన ఆలయ ధర్మకర్తలను భక్తులు పొనుగుపాడు ప్రజలు అభినందించారు.

















## మహాకుంభాభిషేకం

సాధారణంగా స్వామి వార్కి నిత్యం జరిగే పూజా కార్యక్రమాలలో (సాలగ్రామ) శివలింగాన్ని జలంతో స్నానమాచరిస్తారు. భక్తులు వారి కోరికలు, మొక్కుబడుల ననుసరించి శక్తి కొలది పాలు, తేనె, పెరుగు, ఆవు నేయి, చెరుకు రసం, మొదలగు వాటితో స్వామి వారిని స్నానం చేయించే కార్యక్రమాన్ని అభిషేకం అంటాం. ఆలయం నిర్మితమైన తరువాత నిర్ణీత కాలానికి లేదా ఆలయం జీర్ణోద్ధరణ కార్యక్రమం జరిగినప్పుడు పుణ్యనదులలో సేకరించిన జలంను 108 కలశంలో నింపి శాస్త్రోక్తంగా పూజించి, ఆ కలశంలలోని జలంను ఆలయ శిఖరాలపై వేదపండితుల మంత్రోచ్చరణలతో అవగాహనము (ధారగా పోయుట) చేయు కార్యక్రమమును ప్రాణప్రతిష్ట లేదా మహాకుంభాభిషేకం అంటారు. ఆలయం నిర్మితమై వందేళ్లు పూర్తి అయినందున శతజయంతి కార్యక్రమాలలో భాగంగా తదియ రోజు (26.03.2016) మహాకుంబాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయం పైన శిఖరం వద్దకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెట్లు ఎక్కి భక్తులు కలశాలను పూజారులకు అత్యంత భక్తి శ్రద్దలతో మహాకుంభాభిషేకంనకు అందించారు. అంతేకాదు హంపీ పీఠాధిపతి (కర్నాటక) శ్రీ విద్యారణ్య భారతీ మహాస్వామి, ఋషికేష్ పీఠాధిపతి శ్రీ వేదానంద గురు మహర్ తదితర పీఠాధిపతుల రాక ఆలయ ప్రతిష్టను మరింత పెంచింది. పీఠాధిపతులందరు మెట్లన్నీ ఎక్కి ప్రత్యేక పూజలు జరిపారు. ఆ కార్యక్రమం అనంతరం వేదిక మీదకు వచ్చి ప్రియ భాషణం చేసి అలయ విశిష్టతను కొనియాడారు.











## శాంతి కళ్యాణం

ఆ తరువాత సాయంత్రం 108 దంపతులతో స్వామి వారికి అత్యంతవైభవంగా జరిగిన శాంతి కళ్యాణం అందరిని అలరించింది. పురాణాలు, శాస్త్రాలు ప్రకారం కుమార్తెలు ఉండి వివాహ సమయంలో కన్యాదానం కార్యక్రమం చేయని దంపతులు, అలాగే మగ సంతానం ఉండి కన్యాదానమునకు అవకాశం లేని దంపతులు శాంతి కళ్యాణంలో పీటల మీద కూర్చొంటే కన్యాదానం చేసినంతటి ప్రతిఫలం అంటే భర్త వైపు పది తరాలు వారు, భార్య వైపు పది తరాలు వారు మోక్షమార్గం పొందుతారని, కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు ఉంటాయని, కృత యుగంలో తపస్సుకు, త్రేతా యుగంలో జ్ఞానానికి, ద్వాపర యుగంలో యజ్ఞాలకి, కలియుగంలో, కన్యాదానానికి విశిష్ట స్థానం ఉన్నట్లుగా పద్మ పురాణం ద్వారా తెలుస్తుంది. శాంతి కళ్యాణంలో పాల్గొనిన దంపతులందరి చేత స్వామి వారికి తలంబ్రాలు పోయించి, వారందరికి ఆలయ పాలక వర్గం తరపున వంకాయలపాటి బలరామకృష్ణయ్య, డాక్టరు మర్రి పెద్దయ్య తదితరులు నూతన వస్త్రాలు బహూకరించారు.




















## విశేషం

సుమారు 150 సంవత్సరాల క్రిందట పొనుగుపాడు గ్రామం నుండి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు దగ్గర చింతలపూడి తాలూకా, కళ్ళచెరువు గ్రామానికి వలస వెళ్లిన పొనుగుపాటి వెంకటరమణయ్య, లక్ష్మమ్మ దంపతుల వారసుడైనటువంటి నాలుగవ తరానికి చెందిన ముదిమనవడు ప్రసాదరావు, వారి సతీమణి ఛాయాకుమారి, కుమారుడు పవన్ శ్రీరామ్, కుమార్తె తనిష్క హైదరాబాదు నుండి పొనుగుపాడు గ్రామం వచ్చి శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారిని దర్శించుకుని, మహాకుంభాభిషేకం, శాంతికళ్యాణం కార్యక్రమాలలో పాల్గొనుట విశేషం. అంతేగాదు స్వామి వారి కళ్యాణం కన్యావరణం ఘట్టంలో వీరిని గౌతమ మహాఋషిగా కళ్యాణవేదిక మీదకు ఆహ్వానించి తాంబూలం ఇచ్చి ఉచితరీతిన సత్కరించారు.

కుమారుడు పవన్ శ్రీరామ్ ఆరు సంవత్సరాల వయస్సులో (2006)లో బాలనటుడుగా సినిమారంగంలో ఆరంగ్రేటం చేసి పలు సినిమాలలో, టి.వి. సీరియల్స్ నందు బాలనటుడుగా గత పది సంవత్సరాల నుండి నటించారు. ప్రముఖ చిత్రకారుడు బాపు దర్శకత్వం వహించిన శ్రీరామరాజ్యం, సుందరకాండల చిత్రాలలో బాలనటుడిగా నటించారు. ఆలయ పాలకవర్గం తరుపున ప్రసాదరావు, పవన్ శ్రీరామ్‌లను వంకాయలపాటి బలరామకృష్ణయ్య వారిని దుశ్సాలువతో సత్కరించి నూతన వస్త్రాలు బహుకరించారు.













## పొనుగుపాడు పుణ్యం చేసుకుంది

పొనుగుపాడులోని శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వందేళ్ల పండగ సందర్భంగా నిర్వహించిన పూజలు, యాగాలను వీక్షించి, భక్తులను ఆశీర్వదించిన ఐదు పడగల ఆదిశేషుని దర్శనం చేసుకుని తరించటం మరో గొప్ప విశేషంగా వుంది. 25.03.2016 సాయంత్రం వేదిక మీద జరగవలసిన కార్యక్రమ ఏర్పాట్లలో కె.వి.కె. రామారావు నిమగ్నమై ఉన్న సమయంలో వారి సోదరి సూరాబత్తుల సుశీల పిలిచింది. అంతటితో ఆగకుండా ఆయన చేయి పట్టుకుని పరుగున ఆలయం గేటు వద్దకు శరవేగంగా తీసుకువెళ్లి ఆకాశం వైపు చూడమంది. దేవాలయం ప్రధాన గోపురాల పైనుంచి ఆకాశంలో కనుపించిన దృశ్యం చూసి తన జన్మ ధన్యం అయిందనుకుని, చేతులెత్తి నమస్కరించి సెల్ నందు దృశ్యం బంధించి వెనువెంటనే వేదిక మీదకు పరుగుతీసి మైకు తీసుకుని జరుగుతున్న భజన కార్యక్రమాలను ఆపు చేయించి, అందరిని ఆలయగేట్ల వద్దకు వెళ్లి ఆలయం మీది నుంచి ఆకాశంలో ఆధిశేషుని చూడాలని కోరారు. అంతే..అందరూ పరుగున వెళ్లి ఆవైభావాన్ని చూసి నమస్కరిస్తూ చేసిన జయజయధ్వానాలు మిన్ను ముట్టాయి. దాదాపు 20 నిముషాలు ఐదు పడగలతో దర్శనం ఇచ్చిన అధిశేషుని విన్యాసాన్ని భక్తులందరూ తనివి తీరా దర్శించి తరించారు.

వందేళ్ల పండగ మూలంగా పొనుగుపాడు ఇలా ఎన్నో కొత్త విషయాలను చూసింది. మరెంతో విజ్ఞానాన్ని సంపాదించుకుంది. ఇంత కంటే పొనుగుపాడుకు ఇంకేం కావాలి...

## మహాన్నదానం

వందేళ్ల పండగ సందర్భంగా 19.03.2016 నుండి 25.03.2016 వరకు జరిగిన అన్నదానంతో పాటు 26.03.2016న ముగింపు రోజు మధ్యాహ్నం నుండి రాత్రి వరకు మహాన్నదానం కార్యక్రమం జరిగింది.





# శతజయంతి ఉత్సవాల్లో మరికొన్ని చిత్రాలు



















# శాంతి కళ్యాణంలో స్వామివారికి తలంబ్రాలు సమర్పిస్తున్న దంపతులు



# శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారి శత జయంతి సందర్భంగా ప్రముఖులకు పురస్కారాల అందజేత


























# శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారి శత జయంతి సందర్భంగా ప్రముఖులకు పురస్కారాల అందజేత





















## శ్రీ గంగా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం



ఆనాటి శిలాలయం



ఈనాటి దేవాలయం

# "సర్వేజన సుఖినో భవంతు"

## శుభం

**ఇప్పటికి ఇంతే...**

**ఇంకా ఉంది...**